మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?
M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com
సంప్రదించండి

మనం
జనం కోసం అక్షర యజ్ఞం...
ఉమ్మడి
ఉత్తరాంధ్ర జిల్లాలు
మంగళవారం | 23 | జూన్ | 2026 పేజీలు : 10

# రైతులకు ఎరువుల కొరత ఉండదు..అక్రమాలకు తావులేదు



2వ పేజీలో

- డీలర్లు, కంపెనీలకు మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టమైన హెచ్చరిక
- బలవంతపు ఎరువుల విక్రయాలపై ఉక్కుపాదం
- కౌలు రైతులు, ఆండ్రాయిడ్ ఫోన్ లేని రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- నానో యూరియా, సహజ వ్యవసాయంపై అవగాహన పెంచాలీ
- ప్రతి ఎరువుల బస్తాకు పూర్తి లెక్క ఉండేలా పర్యవేక్షణ
- ఎంఆర్పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు, ఎరువుల అక్రమాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి , జూన్ 22 ( మనం న్యూస్ ) :** ఖరీఫ్-2026 వ్యవసాయ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో ఎరువుల లభ్యత, పంపిణీ, నిల్వలు, సరఫరా పరిస్థితులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, వివిధ ఎరువుల తయారీ సంస్థల ప్రతినిధులు, డీలర్ల సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు అవసరమైన మేరకు మాత్రమే కాకుండా, అవసరానికి మించి కూడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా యూరియా సరఫరాలో

## పీజీఆర్ఎస్ వినతుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి : కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్



**విశాఖపట్నం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** పీజీఆర్ఎస్ వేదికగా ప్రజల నుంచి వచ్చే వినతులకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకిరంచిన ఆయన ఈ మేరకు మాట్లాడారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని కలెక్టర్ స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు అందజేశారు. ప్రతి వినతిని అధికారులు సానుభూతితో పరిశీలించి నిర్దేశిత గడువులోపు పరిష్కారం అందించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జాప్యానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు సంతృప్తికరమైన పరిష్కారం అందించే దిశగా చర్యలు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

**వివిధ సమస్యలపై 313 వినతులు అందజేత**

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన పీజీఆర్ఎస్‌కు ప్రజలు వివిధ సమస్యలపై మొత్తం 313 వినతులు సమర్పించారు. శాఖల వారీగా ప్రజలు సమర్పించిన వినతుల్లో రెవెన్యూ శాఖకు 17, జీవీఎంసీకి 74, పోలీసు శాఖకు 19, ఇతర శాఖలకు 203 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్‌తో పాటు, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆర్డీవో ఎం. విశ్వేశ్వరనాయుడు, ఏడీసీ సత్యవేణి, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి శేషశైలజ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అన్ని విభాగాల జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా సేవల్లో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలి : జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి



2వ పేజీలో

**విశాఖపట్నం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయాన్ని మరింత పెంచేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వివిధ శాఖల పనితీరు, ప్రజాభి ప్రాయ సర్వే ఫలితాలను ఆమె పరిశీలించారు .జిల్లాస్థాయి లో నిర్వహించిన తాజా ప్రజాభిప్రాయ సర్వే నివేదికలను

## డయల్ యువర్ ఎమ్మెల్యే: ఫోన్ కాల్‌తోనే పరిష్కార మార్గం - రోడ్డు సమస్యలపై ఎమ్మెల్యే బండారు సత్వర స్పందన



2వ పేజీలో

**దేవరాపల్లి , జూన్ 22 ( మనం న్యూస్ ) :** మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమం ద్వారా సోమవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు నియోజకవర్గ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు ఆలకించారు .గంట పాటు నిర్విరామంగా సాగిన కార్యక్రమంలో మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల నుంచి పలు ఫోన్ కాల్స్ వచ్చాయి. రోడ్లు, తాగునీరు, పెన్షన్లు, విద్యుత్ సమస్యలే అధికంగా ఉన్నాయి.దేవరాపల్లి మండల

# రైతులకు ఎరువుల కొరత ఉండదు..అక్రమాలకు తావులేదు

**ఒకటి తరువాయి** ఎటువంటి కొరత లేకుండా అధికారులు, కంపెనీలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. యూరియా లేదా డీఏపీ కొనుగోలు చేసే రైతులకు బలవంతంగా కాంప్లెక్స్ ఎరువులు విక్రయించే ధోరణిని వెంటనే నిలిపివేయాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన ఎరువులను మాత్రమే అందించాలని, అనవసరమైన ఉత్పత్తులను బలవంతంగా విక్రయించడం సహించబోమని హెచ్చరించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, సంబంధిత కంపెనీలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎంఆర్పీ ధర కంటే ఎక్కువ ధరలకు యూరియా విక్రయించడం చట్టవిరుద్ధమని పేర్కొన్న మంత్రి, రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎరువుల డీలర్లు ఎంఆర్పీ ధరకే విక్రయాలు జరపాలని ఆదేశించారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయించినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న మంత్రి, యూరియా పక్కదారి పట్టకుండా ప్రత్యేక విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఎరువుల బస్తాకు పూర్తి లెక్క ఉండేలా పటిష్ట పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయనున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన అక్రమాలు, అవకతవకలు పునరావృతమైతే ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని హెచ్చరించారు. రైతులకు ఎరువుల బుకింగ్ కోసం అందుబాటులో ఉన్న యాప్ నిర్వహణ మరింత సజావుగా ఉండాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా కౌలు రైతులు, ఆండ్రాయిడ్ ఫోన్ లేని రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటీపీలు ఆలస్యంగా రావడం, మెసేజ్ లింకులు సకాలంలో అందకపోవడం వంటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులతో పాటు పర్యావరణ హిత విధానాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. నానో యూరియా వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అదే సమయంలో సహజ వ్యవసాయంపై రైతుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోందని, దీనిని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల నేల సారంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్న మంత్రి, సాధ్యమైనంత మేర రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సమతుల్య పోషకాల వినియోగంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. అధిక ఎరువుల వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల సంక్షేమం, ప్రయోజనాలే అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ ఎమ్మెల్యే: ఫోన్ కాల్‌తోనే పరిష్కార మార్గం - రోడ్డు సమస్యలపై ఎమ్మెల్యే బండారు సత్వర స్పందన

**ఒకటి తరువాయి** ప్రజలు కాశీపురం-గవరవరం మధ్య రోడ్డు పనులు ఆరు నెలలుగా నిలిచిపోయాయని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ప్రయాణికులు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ, కాంట్రాక్టర్‌కు తారు సరఫరా ఆలస్యం కావడంతో పనులు తాత్కాలికంగా ఆగాయని తెలిపారు. ఆర్అండ్‌బీ ఎస్ఈతో ఇప్పటికే మాట్లాడానని, త్వరలో తారు ట్యాంకర్లు వస్తాయని చెప్పారు. "తారు రాగానే యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయిస్తా. పనుల నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదు" అని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.దేవరాపల్లికి చెందిన ఆర్మీ జవాన్ గుల్లిపల్లి అప్పలనాయుడు తమ కాలనీలో సీసీ రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు. "దేశరక్షణలో ఉన్న మన సైనికుడి కోరికను తీర్చడం మన బాధ్యత. పల్లె పండుగ-3 లో అర్జీ పెట్టుకుంటే వచ్చే నెలలోనే సీసీ రోడ్డు మంజూరు చేయిస్తా" అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.వచ్చిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసుకుని సంబంధిత ఎంపీడీవో, తహసీల్దార్, ఈఈలకు వెంటనే ఫోన్ చేసి పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వారం రోజుల్లో యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ఇవ్వాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటా" అని బండారు సత్యనారాయణమూర్తి ప్రకటించారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపడంపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సేవల్లో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలి : జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి

**ఒకటి తరువాయి** విశ్లేషించిన ఆమె, పలు శాఖలు గణనీయమైన పురోగతి సాధించాయని పేర్కొన్నారు. 12 శాఖల పరిధిలోని సేవలపై చేపట్టిన సర్వేలో ఆరు శాఖలు మెరుగైన స్థితిలో ఉన్నాయని పేర్కొంటూ సంబంధిత విభాగాల అధికారులను ఆమె అభినందించారు. మిగిలిన ఆరు విభాగాల పరిధిలో సేవలను మరింత విస్తరించి ప్రజల్లో సానుకూల పెరిగేలా సేవలను అందించాలని సూచించారు. రెవెన్యూ, డీఆర్‌డీఏ, ఎస్.హెచ్.జి. సెర్ప్ కార్యక్రమంపై సానుకూలతను ఆమె ప్రస్తావించారు. అలాగే సివిల్ సప్లైస్, ఆర్వోఆర్ సర్వేపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలంటే అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రజలు అందించే అభిప్రాయాలు, ఫిర్యాదులను అధికారులు సానుకూలంగా స్వీకరించి సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపర్చాలని సూచించారు. ప్రతి శాఖ తమ పనితీరును నిరంతరం సమీక్షించుకొని ప్రజల సంతృప్తి స్థాయిని పెంచే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఏడేళ్ల చెత్తకు విముక్తి కేసుపురం చిన్న గెడ్డకు మోక్షం

**ఇచ్ఛాపురం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** ఏడేళ్లుగా చెత్త కుప్పలతో దుర్గంధభరితంగా మారిన కేసుపురం గ్రామ సమీపంలోని చిన్నగెడ్డకు ఎట్టకేలకు విముక్తి లభించింది. పాలకుల నిర్లక్ష్యంతో సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్తను కేసుపురం పంచాయతీ టీడీపీ ప్రధాన కార్యదర్శి, ఉత్తమ కార్యకర్త గుజ్జు భీమరాజు చొరవ తీసుకుని జేసీబీ సహాయంతో పూర్తిగా తొలగింపజేశారు. దీంతో గ్రామ ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం లభించింది. శ్రీకాకుళం జిల్లా, ఇచ్ఛాపురం మండలం, కేసుపురం గ్రామంలో చెత్తను పారవేసేందుకు ప్రత్యేకంగా డంపింగ్ యార్డు లేకపోవడంతో గ్రామంలో సేకరించే చెత్తను చిన్నగెడ్డ వద్దనే వేస్తూ వచ్చారు. కాలక్రమేణా అక్కడ భారీగా చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపించడమే కాకుండా దోమలు, ఈగలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పుగా మారింది. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉండేదని గ్రామస్థులు తెలిపారు. ఈ సమస్యను గుర్తించిన గుజ్జు.భీమరాజు గ్రామ ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని పంచాయతీ ప్రత్యేక అధికారి, కార్యదర్శి కోటేశ్వరరావుతో చర్చలు జరిపారు. అనంతరం అధికారుల సహకారంతో జేసీబీని ఏర్పాటు చేసి చిన్నగెడ్డలో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. దీంతో ఏళ్ల తరబడి పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సమస్యకు ముగింపు పలికిన భీమరాజును గ్రామ ప్రజలు అభినందించారు. ప్రజా సమస్యలపై స్పందించి వెంటనే చర్యలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే కూటమి నాయకులు, సభ్యులు కూడా కార్యక్రమంలో పాల్గొని పరిశుభ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పిట్ట.పురుషోత్తం రెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు పిట్ట.రామారావు, బుడత.తిరుపతి, మన్యాల.జానకిరావు, గ్రామనాయుడు సూరు.కామరాజు, కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు

## యోగ పై డిపి రాజు ఏకాగ్రత..పలువురి ప్రశంసలు



**ఆనందపురం , జూన్ 22 ( మనం న్యూస్ ):** అంతర్జాతీయ 12వ యోగ దినోత్సవం ఆనందపురం మండలం గొట్టిపల్లి గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. అదే గ్రామానికి చెందిన బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి డిపి రాజు పాల్గొని వివిధ యోగాసనాలు చేస్తూ పెద్దలను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని మనసు, శరీరం మరియు ఆత్మ మధ్య సమతుల్యతను పెంచే జీవన విధానంగా పేర్కొన్నారు. దీనివల్ల శారీరక రుగ్మతలు దూరమవు తాయన్నారు. దైనందిన జీవితంలో యోగా కూడా ఒక భాగం కావాలన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు తదితరులు డిపి రాజును అభినందించారు.

# ఈత సరదా... యువకుడు మృత్యువాత

## గంభీరం జలాశయం వద్ద ఘటన



**ఆనందపురం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** గంభీరం రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన ఘటన ఆనందపురం మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, విశాఖపట్నానికి చెందిన గొట్టుముక్కల శ్రీధర చక్రవర్తి (28) తన స్నేహితులు జి. ప్రశాంత్, శౌవిక్ చౌదరితో కలిసి సోమవారం తెల్లవారుజామున సూర్యోదయం వీక్షించేందుకు గంభీరం రిజర్వాయర్‌కు వెళ్లాడు. అనంతరం ముగ్గురూ ఈత కొట్టేందుకు నీటిలోకి దిగారు. ఈతలో నైపుణ్యం కలిగిన వారే అయినప్పటికీ, శ్రీధర చక్రవర్తి కొంత దూరం వెళ్లిన తర్వాత నీటి లోతు ఒక్కసారిగా పెరగడంతో మునిగిపోయినట్లు తెలుస్తోంది. అతని స్నేహితులు ఒడ్డుకు చేరుకోగా, శ్రీధర చక్రవర్తి మాత్రం నీటిలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, విపత్తు నిర్వహణ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

అనంతరం శ్రీధర చక్రవర్తి మృతదేహాన్ని గుర్తించి భీమిలి సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి తండ్రి గొట్టుముక్కల మధు జగన్నాథ రాజు (59), ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కెమికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్, తన కుమారుడి మృతిపై ఎటువంటి అనుమానం లేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆనందపురం సీఐ సీహెచ్ వాసు నాయుడు కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తును ఎస్ఐ ఎం. హరీష్‌కు అప్పగించారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# ఇన్‌ఆర్బిట్ మాల్ విశాఖపట్నం, షాపింగ్‌కు అతీతమైన అనుభవాలతో నిండిన జూన్‌ను అందిస్తోంది

**విశాఖపట్నం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** ఇన్‌ఆర్బిట్ మాల్ విశాఖపట్నం ఈ జూన్‌లో, సమాజ కేంద్రీకృత కార్యక్రమాలు మరియు కొత్త స్టోర్ల ప్రారంభోత్సవాల ద్వారా సృజనాత్మకత, ఆరోగ్యం, వినోదం, ఫ్యాషన్ మరియు రిటైల్ అనుభవాలను ఒకచోట చేర్చడానికి సిద్ధంగా ఉంది. తద్వారా నగరంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన జీవనశైలి గమ్యస్థానాలలో ఒకటిగా తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోనుంది. ఈ నెల కార్యక్రమాలకు ఒక స్టైలిష్ హంగును జోడిస్తూ 'స్నీకర్ స్టోరీస్' అనే కార్యక్రమం రాబోతోంది. ఇది స్నీకర్ సంస్కృతిని మమేకం చేసే ఒక అద్భుతమైన వేడుక. మాల్‌లోని కొన్ని ప్రముఖ పాదరక్షల బ్రాండ్‌లను ప్రత్యేకంగా ప్రదర్శించడం ద్వారా ఇది ఫ్యాషన్ ప్రియులను, కలెక్టర్లను మరియు కొనుగోలుదారులను ఒకచోట చేర్చుతుంది. ఈ కార్యక్రమంలో, పాల్గొనే బ్రాండ్‌లను హైలైట్ చేసే విజువల్ డిస్‌ప్లేలతో పాటు, స్నీకర్ల స్ఫూర్తితో రూపొందించిన ఇన్‌స్టాలేషన్‌లు మరియు మర్చండైజ్ డిస్‌ప్లేలతో కూడిన ఒక అనుభవాత్మక సెటప్ ఉంటుంది. సందర్శకులు ఇక్ స్నీకర్ పెయింటింగ్ బార్ మరియు స్నీకర్ లాండ్రీ ఎక్స్‌పీరియన్స్ వంటి ఆసక్తికరమైన కార్యకలాపాలలో కూడా పాల్గొనవచ్చు. తద్వారా వారు ఒక ఇంటరాక్టివ్ వాతావరణంలో తమ సృజనాత్మకతను మరియు స్నీకర్ల సంరక్షణను అన్వేషించవచ్చు. ఈ అనుభవంలో 'స్నీక్ ఎ విన్' యాక్టివిటీ కూడా ఉంటుంది, ఇది ప్రచారం అంతటా కొనుగోలుదారులకు ఉత్సాహాన్ని అందిస్తుంది. జూన్ నెల పొడవునా సందర్శకులను ఉత్తేజపరిచి, ఉల్లాసభరితమైన వాతావరణాన్ని సృష్టించేందుకు మాల్ పలు వారాంతపు కార్యక్రమాలను నిర్వహిస్తుంది. వీటిలో ఫ్రీస్టైల్ డ్యాన్స్ ప్రదర్శనలు, డీజే




సాయంత్రాలు, బి-బాయ్ ప్రదర్శనలు, మరియు స్కేటింగ్ ప్రదర్శనలు ఉంటాయి. ఇవి స్థానిక ప్రతిభావంతులను, వినోద ప్రియులను ఒకచోట చేర్చి, వారాంతపు అద్భుతమైన అనుభవాలను అందిస్తాయి. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఇన్‌ఆర్బిట్ మాల్ విశాఖపట్నం, టెక్నో స్పోర్ట్స్‌తో కలిసి సామూహిక ఆరోగ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో వృత్తిపరమైన శిక్షకులచే మార్గదర్శక యోగా సెషన్‌లు ఉంటాయి. ఇది నగరం నలుమూలల నుండి ఫిట్‌నెస్ ప్రియులను, కుటుంబాలను, మరియు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించే వ్యక్తులను ఒకచోట చేర్చుతుందని భావిస్తున్నారు. ఈ వేడుక ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తూ, అప్రమత్తత మరియు శ్రేయస్సుపై కేంద్రీకృతమైన ఉమ్మడి అనుభవాన్ని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ అనుభవపూర్వక కార్యక్రమాలతో పాటు, జూన్ నెలలో ఇన్‌ఆర్బిట్ మాల్ విశాఖపట్నంలో అనేక కొత్త బ్రాండ్‌లు కూడా రానున్నాయి. ఇవి కొనుగోలుదారులకు అందుబాటులో ఉన్న రిటైల్ మిక్స్‌ను మరింత మెరుగుపరుస్తాయి. త్వరలో ప్రారంభం కానున్న వాటిలో టెక్నో స్పోర్ట్స్, మార్కెట్ 99, జి-షాక్, అర్‌దబ్ల్యుసి, కపిల్ సెలూన్, న్యూ మీ, థర్డ్ వేవ్ కాఫీ, నెక్స్ట్, ఆసిక్స్, ఇంక్.5, లాంగ్వేజ్, జగదంబ పెర్ల్స్, సూపర్‌డ్రై, డెస్టినో, రేర్‌జెడ్, మరియు లా మార్టినా ఉన్నాయి. సామాజిక భాగస్వామ్యం, ఆరోగ్య కార్యక్రమాలు, ఫ్యాషన్-ఆధారిత అనుభవాలు, వినోదం, మరియు కొత్త రిటైల్ ఆఫర్ల యొక్క చైతన్యవంతమైన మిశ్రమంతో, ఇన్‌ఆర్బిట్ మాల్ విశాఖపట్నం సందర్శకులకు షాపింగ్‌కు మించి మరెన్నో అందించే గమ్యస్థానంగా అభివృద్ధి చెందుతూనే ఉంది. ఇది ప్రజలు ఒకరితో ఒకరు కనెక్ట్ అవ్వడానికి, వేడుకలు జరుపుకోవడానికి, తమను తాము వ్యక్తీకరించుకోవడానికి, మరియు ప్రతి సందర్శనలో కొత్తదనాన్ని కనుగొనడానికి వీలు కల్పించే ప్రదేశాలను సృష్టిస్తోంది.

# ఆరోవ తరగతి సీట్లు పెంచాలి

**ముంచంగి పుట్టు , జూన్ 22 ( మనం న్యూస్ ) :** విద్యార్థులకు అనుగుణంగా కొత్త పాఠశాల మంజూరు చేయాలని ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం నేతలు కొర్రా త్రినాధ్,ఎంఎం శ్రీను మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల విద్య పూర్తి చేసి ఆరవ తరగతి జాయినింగ్ నిమిత్తం మండలంలో ఉన్న అన్ని పాఠశాలలో తిరిగిన ప్రభుత్వం ఆదేశం ప్రకారం సీట్లు భర్తీ అయిందని,అదనంగా జాయినింగ్ చేయుటకు అవకాశం లేదని తిరస్కరించారు,తిరిగి, తిరిగి అలిసిపోయి గిరిజన సంఘంనీ సంప్రదిస్తే విద్యార్థులు,విద్యార్థుల తల్లి తండ్రులతో నిరసన చేస్తే మండల అభివృద్ధి అధికారి కె.ధర్మారావు సమక్షంలో గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి స్వర్ణ లత వివిధ పాఠశాల హెచ్ఎం లకు వచ్చిన ప్రతి విద్యార్థికి అడ్మిషన్ ఇవ్వాలని దరఖాస్తుల్లో సంతకం




చేసి పంపించి జాయినింగ్ చేయించారు,స్పందించిన అధికారులకు ధన్యవాదములు,అలాగే విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతున్నందున బాలిక,బాలురలకు కొత్త పాఠశాలలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం,ఇందులో ఆదివాసీ మహిళ సంఘం కార్యదర్శి ఎస్. ఈశ్వరి,విద్యార్థుల తల్లి తండ్రులు సుందర్,భవాని శంకర్,శుక్రన పాల్గొన్నారు.

## రైతన్న మీ కోసం, ఇంటింటి ప్రచార కార్యక్రమం

**తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొంతేరి జాగత్రాయ్**



**ముచ్చంగిపుట్టు , జూన్ 22 ( మనం న్యూస్ ) :** అల్లూరి,ముంచంగిపుట్టు మండలం, పనసపుట్ పంచాయతీ సంగవలస గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం రైతుల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు చర్యలు తీసుకునే ఒక ముఖ్యమైన కార్యక్రమం. ఈ కార్యక్రమంలో కె జాగత్రాయ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ద్వారా రైతులు వ్యవసాయం, సాగునీరు, విద్యుత్, ఎరువులు, విత్తనాలు, పంటల నష్టపరిహారం వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే అందేలా చూస్తాను అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ మండల ప్రధాన కార్య దర్శి కె జాగత్రాయ్,పంచాయతీ ఉపసర్పంచ్ డి చిరంజీవి,బి శ్యామ్, ఆర్గాని సంస్థ జె జగన్నాధం, జె భాస్కరరావు,పి భీమల, సచివాలయం హార్టికల్చర్ ఆఫీసర్ ఎస్ ఎండన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు విశాఖలో ఏపీ శాసనసభ పిటిషన్స్ కమిటీ పర్యటన

**విశాఖపట్నం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటిషన్స్ కమిటీ మంగళవారం విశాఖపట్నం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. కమిటీ 23న ఉదయం 10 గంటలకు కమిటీ వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో సమావేశమై ప్రజా పిటిషన్లకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించనుందని పేర్కొన్నారు. ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ శాఖకు సంబంధించిన ఏపీఐఐసీ భూవివాదాలు, గాజువాక అపారెల్ పార్క్, పునరావాస కుటుంబాలకు ప్లాట్ల కేటాయింపు తదితర అంశాలపై చర్చ సాగనుందన్నారు. అనంతరం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖకు సంబంధించిన టిడిఆర్ ఆస్తులు, రోడ్డు విస్తరణ, భూసేకరణ పరిహారం అంశాలపై సమీక్ష ఉంటుందని చెప్పారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన 22-ఏ జాబితా, గృహ స్థలాల క్రమబద్ధీకరణ, నిషేధిత ఆస్తుల జాబితా నుంచి భూముల తొలగింపు అంశాలపై కూడా కమిటీ చర్చించను న్నట్లు స్పష్టం చేశారు. అదేవిధంగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేసిన పలు ఫిర్యాదుల మేరకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉ ఇన్వెస్ట్‌మెంట్ శాఖ పరిధిలో జెట్టి నిర్మాణం, జి.ఓ.ఎం.ఎస్. నెం.26 అమలు అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకోనుందని పేర్కొంటూ తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఉత్వర్వులు జారీ చేశారు.ఇదిలా ఉండగా ఛైరపర్సన్ కె. రఘురామ కృష్ణరాజు అధ్యక్షతన గల పిటిషన్ల కమిటీలో సభ్యులు గంటా శ్రీనివాసరావు, గురజాల జగన్మోహన్, కొణతాల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు మంగళవారం జరిగే సమావేశానికి హాజరుకానున్నట్లు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర షెడ్యూల్ ప్రకటించారు.

# ఎల్‌నినోను ధైర్యంగా ఎదుర్కొందాం

**- రైతులకు ప్రతి అడుగులో అండగా ఉంటాం**

**- సచివాలయంలో రైతుల కోసం ప్రత్యేక సమాచార సంచిక ఆవిష్కరించిన మంత్రి అచ్చెన్నాయుడు**



**అమరావతి , జూన్ 22 ( మనం న్యూస్ ) :** రాష్ట్రంలో ఎల్‌నినో రైతాంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావాలను తగ్గించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందని, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, ముందస్తు ప్రణాళికలు, సాంకేతిక సూచనల ద్వారా రైతులకు అండగా నిలుస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సచివాలయంలో రైతులకు ఉపయోగపడే విధంగా వ్యవసాయ శాఖ రూపొందించిన "ఎల్‌నినోను సమర్థవంతంగా ఎదుర్కొందాం" అనే ప్రత్యేక సమాచార సంచికను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, వర్షపాతం లోపాలు, అధిక ఉష్ణోగ్రతలు వంటి ఎల్‌నినో ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలోని వివిధ వ్యవసాయ వాతావరణ మండలాలకు అనుగుణంగా పంటల ఎంపిక, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి యాజమాన్య పద్ధతులు, నేల తేమ సంరక్షణ చర్యలు, విత్తనాల వినియోగం, పంటల సంరక్షణకు సంబంధించిన సమగ్ర సూచనలను ఈ సమాచార సంచికలో పొందుపరిచినట్లు తెలిపారు. రైతులు ఈ సూచనలను పాటించడం ద్వారా వాతావరణ ప్రతికూల పరిస్థితులను అధిగమించి దిగుబడులను కాపాడుకోవచ్చున్నారు.వ్యవసాయ శాఖతో పాటు ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ, సహకార శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే చర్యలను అమలు చేస్తున్నాయని మంత్రి వెల్లడించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, వాతావరణ హెచ్చరికలు, పంటల నిర్వహణ సూచనలు గ్రామ స్థాయి వరకు చేరేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వాతావరణ నిపుణుల సూచనల ఆధారంగా రూపొందించిన ఈ ప్రత్యేక సంచిక రైతులకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పంటల వారీగా, ప్రాంతాల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే పద్ధతులు, కరువు పరిస్థితులను ఎదుర్కొనే వ్యవసాయ నిర్వహణ చర్యలు ఇందులో పొందుపరచినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి వాతావరణ సవాళ్లు ఎదురైనా రైతులను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామ స్థాయిలో రైతులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆయన ఆదేశించారు. ఈ ప్రత్యేక సమాచార సంచిక ద్వారా రైతులు శాస్త్రీయ అవగాహన



పెంపొందించుకొని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు నిర్ణయాలు తీసుకోవడంతో పాటు నష్టాలను తగ్గించుకునే అవకాశం కలుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీ. రాజశేఖర్, డైరెక్టర్ మంజీర్ జిలానీ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## చెక్ డ్యాముల మంజూరు కోరుతూ గ్రీవెన్స్ లో ఎంపీడీవో కు వినతి

**ముంచంగిపుట్టు , జూన్ 22 ( మనం న్యూస్ ) :** మండలంలోని పలు పంచాయతీల్లో చెక్ డ్యాములను మంజూరు చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు. తెలుగుదేశం పార్టీ అరుకు పార్లమెంట్ మాజీ ఆర్గనైజేషన్ సెక్రటరీపాంగి. శాస్త్రిబాబు మాట్లాడుతూ ఈ చెక్ డ్యాములు నిర్మాణం వల్ల రైతులకు అండదండగ నిలవడంతో పాటుగా వర్షపు నీరు సంరక్షణ మరియు భూగర్భ జలాలు పెంపునకు ఇవి ఎంతో ఉపయోగపడతాయాన్ని తెలిపారు ఈకార్యక్రమం లో రాణాసింగి నీలకం



ఠం పాత్రో వంతాల. జగదీశ్ ,కొల్లూరి. రఘునాధ్ .మండి. ప్రభాకర్ తాంగుల. భగీరధి ,పాంగి. హరీష్ , మఠం. రఘునాధ్ పడాల్ ,చెట్టి. నవీన్ కుమార్,మండి. శరత్ కుమార్ పాల్గొన్నారు.

## హోటల్ రూమ్ బాయ్ అదృశ్యం



**మధురవాడ / భీమునిపట్నం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** పీఎం పాలెం విజేత సూపర్ మార్కెట్ ఎదురుగా ఉన్న డివిఆర్ గ్రాండ్ హోటల్‌లో రూమ్ బాయ్‌గా పనిచేస్తున్న సియాదుల సూరిబాబు (36) ఈనెల 6వ తేదీ నుండి అదృశ్యమయ్యారు. విజయనగరం జిల్లాకు చెందిన సూరిబాబు, అతని భార్య వేలగాడ దేవి (23) ప్రస్తుతం పి.ఎం.పాలెంలో నివసిస్తున్నారు.? జూన్ 6న ఉదయం 9:30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన సూరిబాబు తిరిగి రాలేదు. ఫోన్ చేసినా స్పందించకపోవడం, బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య దేవి ఆదివారం పి.ఎం.పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పి. ఎం. పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చేపల మృతిపై ప్రభుత్వం సీరియస్

**నక్కపల్లి , జూన్ 22 ( మనం న్యూస్ ) :** మండలంలోని బోయపాడు సముద్ర తీరంలో శనివారం పెద్ద ఎత్తున చేపలు చనిపోయిన సంఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి నివేదిక అందజేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. దీంతో సోమవారం మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జాతీయ జలచర జంతు వ్యాధుల పర్యవేక్షణ (ఎన్ఎస్‌పీ ఏఏడీ) బృందం బోయపాడు తీరంలో మృత్యువాతపడిన చేపలను పరిశీలించారు. కొన్ని చేపల నమూనాలను సేకరించారు. అదే విధంగా సముద్రంలో నీటి నమూనాలను కూడా సేకరించి, విశ్లేషణ నిమిత్తం కాకినాడలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (ఎస్ఐఎఫ్‌టీ) ప్రయోగశాలకు పంపనున్నట్టు మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ చెప్పారు. ఈ బృందం ఇంకా నక్కపల్లి మండలం బంగారమ్మపేట, పాయకరావుపేట మండలం పెంటకోట సముద్ర తీర ప్రాంతాల్లో వున్న పలు రొయ్యల చెరువుల నుంచి కూడా నమూనాలను సేకరించింది. యంగ్ ప్రొఫెషనల్ ఎన్ఎన్ చైతన్య, జూనియర్ కన్సల్టెంట్ పి.శ్రీనివాస్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు జె.పూర్ణిమ, శివాజీ, త్రినాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# గూగుల్ బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి : గుండు అప్పలరాజు డిమాండ్

**ఆనందపురం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** ఆనందపురం మండలం, తర్లువాడ గ్రామంలో ఏర్పాటు చేయ తలపెట్టిన "గూగుల్ సమాచార కేంద్రం" (డేటా సెంటర్) కోసం భూములు కోల్పోయిన దళిత రైతులకు, భూబాధితులకు తక్షణమే పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని మానవ హక్కులు మరియు సామాజిక సేవా సంస్థ సలహాదారు, సీనియర్ జర్నలిస్ట్ గుండు అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ద్వారా నివేదికను సమర్పించినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తర్లువాడ గ్రామంలో భూముల సేకరణకు సంబంధించి నష్టపరిహారం మరియు పునరావాస ప్యాకేజీ కేటాయింపుల్లో రెవెన్యూ అధికారులు తీవ్ర వ్యత్యాసాలు చూపించారని ఆరోపించారు. ప్రధానంగా ఈ క్రింది అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు: నమోదైన, నమోదుకాని ఆక్రమణల వ్యత్యాసాలు: భూమిని సాగు చేసుకుంటున్న వారిలో



రికార్డులు కలిగిన నలుగురు ఆక్రమణదారులను ఒక వర్గం కింద గుర్తించి ఎకరాకు రూ. 20 లక్షల చొప్పున పరిహారం చెల్లించారు. కానీ, అదే పరిసరాల్లో దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న 65 మంది నమోదుకాని ఆక్రమణదారులను వేరొక వర్గంగా వర్గీకరించి ఎకరాకు కేవలం రూ. 10 లక్షలు మాత్రమే చెల్లించడం తీవ్ర అన్యాయం. రెవెన్యూ అధికారులు ఇటువంటి పక్షపాత ధోరణిని వీడి, బాధితులందరికీ భూసేకరణ చట్టం-2013 ప్రకారం సమాన న్యాయం చేకూర్చాలి. భూమి కేటాయింపుదారుల బకాయిలు: నిబంధనల ప్రకారం భూమిని అనుభవిస్తున్న 51 మంది అసైన్డ్ రైతులకు ఎకరాకు రూ. 50 లక్షల చొప్పున పరిహారం చెల్లించాల్సి ఉంది. అయితే, ప్రతి ఎకరాకు 0.20 సెంట్ల అభివృద్ధి చేసిన భూమిని కేటాయిస్తామనే సాకుతో, ఎకరాకు కేవలం రూ. 40 లక్షలు మాత్రమే చెల్లించి, రూ. 10 లక్షల కోత విధించారు. రాజధాని ప్రాంత భూమి కేటాయింపుదారులకు వర్తింపజేసిన విధంగానే, వీరికి కూడా ఎటువంటి కోతలు లేకుండా మిగిలిన రూ. 10 లక్షల బకాయిలను తక్షణమే విడుదల చేయాలి. భూసేకరణ చట్టం-2013 మరియు పునరావాస ప్యాకేజీ నిబంధనలను పక్కాగా అమలు చేసి, గూగుల్ సమాచార కేంద్రం బాధితులందరికీ సమాన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గుండు అప్పలరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# బోయిల కింతాడలో ముందస్తు వరి విత్తనాల పండగ - నూతన వంగడాలతో రైతుల్లో నూతనోత్సాహం

**దేవరాపల్లి , జూన్ 22 ( మనం న్యూస్ ) :** మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో సోమవారం రైతులకు ఖరీఫ్ వరి విత్తనాలను పంపిణీ చేశారు. కూటమి నాయకుల చేతుల మీదుగా విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది.వర్షాలు పడకముందే ప్రభుత్వం విత్తనాలు అందజేయడంతో సాగు పనులు ముందుగానే మొదలుపెట్టవచ్చని రైతులు హర్షం వ్యక్తం చేశారు.బీపీటీ 5204, ఎంటియు 1224, ఆర్ఎన్ఆర్ 15048 వంటి సన్నరకం, అధిక దిగుబడి వంగడాలను రైతుల కు పరిచయం చేశారు. చీడపీడలను తట్టుకునే రకాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది.50% రాయితీపై క్వింటాల్ విత్తనా లు అందించారు. ఒక్కో రైతుకు గరిష్టంగా 2 క్వింటాళ్ల వరకు సబ్సిడీ వర్తిస్తుందని అధికారులు తెలిపారు.తొలి విడతగా 120 మంది రైతులకు 80 క్వింటాళ్ల విత్తనాలు అందజేశారు. ఆధార్, పట్టాదారు పాస్‌బుక్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు.కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతు పక్షాన ఉ ంటుందని, నాణ్యమైన విత్తనం, ఎరువులు సకాలంలో



అందిస్తామని నాయకులు హామీ ఇచ్చారు.విత్తే ముందు కార్బెండాజిమ్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలని, ఎకరానికి 25-30 కేజీల విత్తనం సరిపోతుందని ఏవో రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తెలుగు రైతు ఆర్గనైజింగ్ కార్యదర్శి కడిమి నాగేశ్వరావు, కొమర బాబురావు, గ్రామ సర్పంచ్, వ్యవసాయ అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.గత ప్రభుత్వ హయాంలో విత్తనాల కోసం ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు ఇంటివద్దకే విత్తనాలు రావడం సంతోషంగా ఉందని రైతులు పేర్కొన్నారు.

# గంటి నాగేశ్వర రావుకు యూనివర్సల్ బుక్ అఫ్ గోల్డెన్ రికార్డ్స్ అవార్డు

**భీమునిపట్నం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** భీమిలికి చెందిన గంటి నాగేశ్వర రావు యూనివర్సల్ బుక్ అఫ్ గోల్డెన్ రికార్డ్స్ సంపాదించారు. విశాఖ్ సంగీత సాగర్ సంస్థ ద్వారా గత కొంత కాలంగా సంగీత కచేరీలని నిర్వహిస్తున్నారు. ఇటీవల విశాఖలో ఆ పాత మదురాలు పేరుతో నిరంతరాయంగా సినీ గీతాలను ఈయన ఆలపించి ఈ రికార్డ్ ని సొంతం చేసుకున్నారు. ఈ సంస్థ చైర్మన్ జానపూడి రవి వర్మ ఈ రికార్డ్ సర్టిఫికెట్ ని అందించారు. విశాఖపట్నం ప్రభుత్వ సర్వే శాఖ లో పని చేసి పదవీ విం మణ చేసిన నాగేశ్వర రావు భీమిలి లో స్థిర పడ్డారు. సంగీతం పై మమకారం తో గత కొంతకాలం గా అనేక సంగీత కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సింగర్‌గా ట్రాక్ సింగర్ గా అనేక ప్రాంతాలలో సంగీత విభావరులను నిర్వహించారు. భీమిలి లో సంగీతం పట్ల అభిరుచి ఆసక్తి వున్నవారిని ప్రోత్సహిస్తానని అన్నారు. ఈయన రికార్డ్ సొంతం చేసుకోవడం పట్ల పలువురు సంగీత అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.



# 28 రోజులు నో బ్యాగ్ డే



**అమరావతి , జూన్ 22 ( మనం న్యూస్ ) :** పాఠశాల విద్యాశాఖ ఎట్టకేలకు 2026–27 విద్యా సంవత్సరానికిగాను అకడమిక్ క్యాలెండర్ విడుదల చేసింది. 'అకడమిక్ క్యాలెండర్ ఏదీ?' శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంతో అధికార యంత్రాంగం స్పందించింది. సోమవారం ఉదయమే క్యాలెండర్‌ను విడుదల చేస్తూ క్షేత్రస్థాయికి సమాచారం ఇచ్చింది. విద్యా సంవత్సరంలో మొత్తం 229 రోజులు పాఠశాలలు పనిచేస్తాయని, 87 సెలవులు ఉంటాయని ఈ క్యాలెండర్‌లో ప్రకటించారు. ప్రతి శనివారం 6 నుంచి 9 తరగతులకు 'నో బ్యాగ్ డే' ఉంటుంది. ఏడాదిలో మొత్తం 28 నో బ్యాగ్ డేలు ఉంటాయి. ఈ రోజుల్లో కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇండోర్ గేమ్స్, విలువల విద్య, వృత్తి విద్య, పాఠశాల స్థాయిలో హిందీ దివస్ పోటీలు, గణిత పజిల్స్, క్విజ్, క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు ఉంటాయి. అక్టోబరు 12 నుంచి 21 వరకు దసరా సెలవులు, జనవరి 11 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు ఉంటాయి. మైనారిటీ పాఠశాలలకు క్రిస్మస్ సెలవులు అదనంగా ఇస్తారు. ఆగస్టు 3 నుంచి 7 వరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్–1, అక్టోబరు 5 నుంచి 8 వరకు ఎఫ్ఏ–2, నవంబరు 9 నుంచి 20 వరకు సమ్మేటివ్ అసట?సమెంట్–1, జనవరి 4 నుంచి 7 వరకు ఎఫ్ఏ–3, ఫిబ్రవరి 8 నుంచి 11 వరకు ఎఫ్ఏ–4, ఫిబ్రవరి 8 నుంచి 18 వరకు ఎస్ఏ–2, ఫిబ్రవరి 8 నుంచి 18 వరకు పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్, మార్చి 15 నుంచి 31 వరకు పబ్లిక్ పరీక్షలు జరుగుతాయి. జూలై 10, డిసెంబరు 5న మెగా పేరెంట్–టీచర్ మీటింగ్స్ నిర్వహిస్తారు. గతేడాది తరహాలోనే రాజ్యాంగ దినోత్సవం రోజున మాక్ పార్లమెంటు నిర్వహిస్తారు. తొమ్మిది నుంచి పదో తరగతికి వచ్చిన విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు ఉంటుంది. వేసవి సెలవులకు ముందు ఈ కోర్సు బోధిస్తారు. పని దినాలు, సెలవులు, పండగ సెలవులు ఉన్నత పాఠశాలల తరహాలోనే ప్రాథమిక పాఠశాలలకు కూడా ఉంటాయి. ఆగస్టు 3 నుంచి 6 వరకు ఎఫ్ఏ–1, అక్టోబరు 5 నుంచి 7 వరకు ఎఫ్ఏ–2, నవంబరు 9 నుంచి 16 వరకు ఎస్ఏ–1, జనవరి 4 నుంచి 6 వరకు ఎఫ్ఏ–3, ఫిబ్రవరి 8 నుంచి 10 వరకు ఎఫ్ఏ–4, ఏప్రిల్ 8 నుంచి 13 వరకు ఎస్ఏ–2 పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు పాఠశాలలు పని చేస్తాయి. 28 రోజులు నో బ్యాగ్ డేగా ఉంటాయి.

# కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన జడ్పీ చైర్ పర్సన్ సుభద్ర

**ముంచంగిపుట్టు , జూన్ 22 ( మనం న్యూస్ ) :** ముంచంగిపుట్టు మండలం సుజన కోట పంచాయతీ తోటపుట్టు గ్రామం పూర్తిగా పివిటిజీల నివాసం ఉండే తండా. ఈ గ్రామానికి ఇప్పటి వరకు సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామస్తులంతా ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకొచ్చారు. దానికంటే ముందు ఆ గ్రామానికి కనీసం వాహనాల రాకపోకలు జరగాలంటే కల్వర్టు నిర్మాణం చేపట్టాలని అప్పుడే అది సాధ్యమవుతుందని ఆమె దృష్టికి తెచ్చారు. వెంటనే ఆమె స్పందించి జిల్లా పరిషత్ నుంచి కల్వర్టు నిర్మాణానికి ఐదు లక్షల మంజూరు చేశారు. దీని నిర్మాణ పనులకు సోమవారం ఆమె కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ తోటాపుట్టు అనేది పూర్తిగా పివిటిజీ గ్రామం అని ఆ గ్రామానికి ప్రభుత్వం గృహాలు మంజూరు చేసిందని కానీ ఆ ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ తీసుకెళ్లేందుకు సరిగ్గా రోడ్డు లేదన్నారు. రోడ్డు లేక ఇప్పటి వరకు ఆ గ్రామంలో ఒక ఇంటి నిర్మాణం కూడా జరగలేదన్నారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామస్తులు ఉన్న రోడ్డుపైనైనా మెటీరియల్



తీసుకెళ్లేందుకు సహకారం అందించాలని కోరునట్లు తెలిపారు. అందులో భాగంగా ఓ కల్వర్టు నిర్మాణం జరిగితే తమ గ్రామానికి మెటీరియల్ వస్తుందని తన దృష్టికి తీసుకు రావడంతో వెంటనే జిల్లా పరిషత్తు నుంచి ఐదు లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నేడు ఈ కల్వర్టు నిర్మాణానికి గ్రామస్తులతో కలిసి శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు.

**వెంటనే రోడ్డు నిర్మించండి**

గ్రామంలో సుమారు 80 నుంచి 100 కుటుంబాల నివాసం ఉన్నాయని ఇప్పటివరకు రోడ్డు లేకపోవడం దురదృష్టకర మన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ గ్రామానికి రహదారి నిర్మాణానికి కృషి చేయాలని సుభద్ర అభ్యర్థించారు. రహదారి లేక ప్రజల పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించాలని ఆమె అన్నారు.

**పిఓను కలిసిన సుభద్ర**

ఆ గ్రామానికి రహదారి మంజూరు చేయాలని పాడేరు ఐటిడిఏ పీవో ఆదిత్య వర్మ కి సుభద్ర కోరారు. కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం పాడేరులో పిఒ ను కలిసి సమస్యను వివరించారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు. కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జె సి ఎస్ కోఆర్డినేటర్ అరబీరు జగబంధు , సుజన కోట తాజా మాజీ సర్పంచ్ వెంగడ రమేష్, మండల పార్టీ అధ్యక్షులు పాంగి పద్మా రెడ్డి , స్థానిక ఎంపీటీసీ మజ్జి సుబ్బలక్ష్మి , దామోదరం, వైఎస్ఆర్సిపి పంచాయతీ ఉపాధ్యక్షులు సీసా రాధాకృష్ణ , సురేష్, నాయుడు, డొంబు, నారాయణ గ్రామస్థులు పాల్గొన్నారు.

# విదేశీ విద్యార్థులు "గీతం రాయబారులు"




**భీమునిపట్నం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో స్టడీ ఇండియా కార్యక్రమం ద్వారా ప్రవేశాలు పొందిన వివిధ దేశాల విద్యార్థులను అంతర్జాతీయంగా గీతం పేరు ప్రఖ్యాతులను విస్తరింపచేసే గీతం రాయబారులుగా పరిగణిస్తామని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు పేర్కొన్నారు. గీతంలో వివిధ కోర్సులు విజయవంతంగా పూర్తి చేసుకుని స్వదేశాలకు తిరిగి వెళుతున్న విద్యార్థులకు సోమవారం నిర్వహించిన ప్రత్యేక పట్టభద్రుల కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థుల కోసం ప్రణాళికా యుతంగా చర్యలు తీసుకుంటోందని, చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా కార్య క్రమాల ద్వారా తీర్చిదిద్దుతోందన్నారు. విద్యార్థులు ఉన్నత విద్య, పరిశోధనల ద్వారా తమ దేశాలకు ప్రయోజనం కలిగించే మానవ వనరులుగా మారాలని కోరారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మాట్లాడుతూ 43 దేశాలకు చెందిన 450 మందికి పైగా విదేశీ విద్యార్థులు గీతం విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారని తెలిపారు.

ఏటా విదేశీ విద్యార్థుల సంఖ్య పెరుగుతూ ఉండటంతో తదనుగుణంగా సౌకర్యాలపై దృష్టి సారించామన్నారు. భారతీయ సంస్కృతి, విద్యావిధానం పట్ల విదేశాలలో ఆదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ ఏడాది గీతం విశాఖ ప్రాంగణం నుంచి 40 మంది విదేశీ విద్యార్థులు ఇంజనీరింగ్, ఫార్మశీ, లా, సైన్స్, పారామెడికల్ కోర్సులతో పాటు మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసుకున్నారని తెలిపారు. కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికేట్‌లను అందజేశారు. కార్యక్రమంలో గీతం విద్యార్థి విభాగం అరుణ్‌కార్తిక్, జిమ్‌సర్ బయోకెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ విశ్వకల్యాణ్, వివిధ విభాగాల డీన్‌లు, అధిపతులు, తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## ప్రభుత్వ పాఠశాలలకు ఆదర్శం

**నర్సీపట్నం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయుల కృషి, ప్రజల ఆలోచనా విధానంలో మార్పులతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో గణనీయంగా ప్రవేశాలు పెరిగాయి. అత్యధిక అడ్మిషన్లతో ఉమ్మడి జిల్లాలోనే కాకుండా ఉత్తరాంధ్రలో (ఆర్జేడీ పరిధి) నర్సీపట్నం మండలం వేములపూడిలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల మొదటి స్థానంలో నిలిచింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కొత్తగా 88 మంది విద్యార్థులు చేరగా, వీరిలో 67 మంది ప్రైవేటు పాఠశాలల నుంచి రావడం విశేషం. ఈ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో మొత్తం 61 మంది విద్యార్థులు వున్నారు. వీరిలో ఐదో తరగతి విద్యార్థులు 28 మంది ఆరో తరగతిలో చేరడానికి ఉన్నత పాఠశాలలకు వెళ్లిపోయారు. రెండు నుంచి ఐదో తరగతి వరకు 33 మంది విద్యార్థులు మిగిలారు. కాగా ప్రభుత్వ ఆదేశాలు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపు మేరకు పాఠశాలలో ప్రవేశాలను పెంచడానికి ప్రధానోపాధ్యాయులు బీఎస్ఆర్ గోవింద, ఉపాధ్యాయులు కలిసి విశేష కృషి చేశారు. ఉన్న విద్యార్థులు ప్రైవేటు బాట పట్టకుండా వుండేందుకు, కొత్తగా వీలైనంత ఎక్కువ మందిని పాఠశాలల్లో చేర్చుకోవడానికి ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలో సదుపాయాలు, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, యూనిఫారం, మధ్యాహ్న భోజనం, తదితర వాటి గురించి వారికి వివరించి అవగాహన కల్పించారు. దీంతో గత విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో చదివిన తమ పిల్లలను ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకు వచ్చారు. పాఠశాలలు తెరిచేనాటికి 88 మంది విద్యార్థులు కొత్తగా చేరారు. వీరిలో 67 మంది రికార్డు ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చిన వారు కావడం విశేషం. సోమవారంనాటికి వేములపూడి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 121 మంది విద్యార్థులు వున్నారు. ఈ నెలాఖరులోగా మరికొంత మంది విద్యార్థులు చేరే అవకాశం వుందని ప్రధానోపాధ్యాయుడు గోవింద తెలిపారు. కాగా ఈ నెల 19న కశింకోటలో జరిగిన జిల్లాస్థాయి విద్యా శాఖ సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు ఈ పాఠశాల పేరును ప్రస్తావించి అభినందించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు చెబుతున్న ఉపాధ్యాయులు... తమ పిల్లలను మాత్రం ప్రైవేటు పాఠశాలల్లో ఎందుకు చదివిస్తున్నారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. దీంతో పలువురు ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో మాన్పించి, ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యా యులు పార్థసారథి, రొంగలి చిరంజీవి, బీవీకే కిశోర్, కేవీ శ్రీను, ఎన్.గోవింద్ తమ కుమార్తెలను (ఏడుగురు) స్థానిక కొత్తూరులోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నారు.

# చీడికాడలో రైతన్న మీ కోసం వారోత్సవాలు : ఏవో కృష్ణవేణి

**అనకాపల్లి / చీడికాడ , జూన్ 22 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలో జూన్ 22 నుండి 27 వరకు ప్రతి గ్రామంలో రైతన్న మీకోసం వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయ అధికారిని కృష్ణవేణి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బైలపూడి, బయలపూడి సింగవరం, చీడికాడ గ్రామాలలో ఈరోజు రైతన్న మీకోసం వారోత్సవాల్లో పర్యటించడం జరిగిందన్నారు.

ఈ వారోత్సవాల్లో భాగంగా రైతులకు అన్నదాత సుఖీభవ నగదు అందినదా లేనిదా అనేది తెలుసుకోవడం జరుగుతుందని.ఎల్ నీనో ప్రభావం దృష్ట్యా స్థాయికి మించి సాధారణ ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వాతావరణ పరిస్థితి దీని ప్రభావం వలన వర్షపాతం సాధారణం కన్నా తగ్గే అవకాశం ఉన్నందున రైతులకు సూచనలు



ఇవ్వడం జరుగుతుందని.నీటితో పండే పంటలు నేర్పు కోవడం, సూక్ష్మ నీటి సాగు పద్ధతులు పాటించడం, వర్షపు నీటిని నిల్వ చేసేలా ఫారం పాండ్లను ఏర్పరచడం, ప్రకృతి వ్యవసాయం ద్వారా నేలలో తేమను నిల్వ ఉంచడం వంటి విషయాలపై రైతులకు సూచనలు ఇవ్వడం జరుగుతుందని. ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా . డిఏపీ ఎరువుల పంపిణీ గురించి రైతులకు వివరించడం జరుగుతుందని, రైతు రిజిస్ట్రీలో నమోదు కాని రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవడం ద్వారా ప్రభుత్వ వ్యవసాయ పథకాలకు అర్హత, వ్యవసాయ పనిముట్లు పై సబ్సిడీ పొందుట, విత్తనాలు ఎరువులు పొందడంలో ప్రాధాన్యత, వ్యవసాయ సేవలు సలహాల ప్రాధాన్యత రైతులకు అందుతుందన్నారు.

# వేగ నియంత్రణ అందరి బాధ్యత : ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్ కుమార్

**గాజువాక , జూన్ 22 ( మనం న్యూస్ ) :** అతివేగమే ప్రమాదాలకు దారి తీస్తుంది అని నగర ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్ కుమార్ అన్నారు.పాత గాజువాక కూడలిలో వేగ నియంత్రణ కోసం సిద్ధం చేసిన టైర్లతో కూడిన భారీకేడ్లను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం అవగాహన లోపం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని వీటి నియంత్రణ అనేది వాహన చోదకులపైనే ఉందన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసిపి భవ్య మాట్లాడుతూ సెల్ఫ్ రెస్పాన్సిబిలిటీ తో ట్రాఫిక్ సమస్య సాధ్యమవుతుం దని ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏ డి సి పి




ప్రవీణ్ కుమార్ ఏసిపి భవ్య సిఐ హుస్సేన్ ఎస్సైలు రాధాకృష్ణ, శాంతారాం వాయిస్ ఆఫ్ గాజువాక సభ్యులు నాగేశ్వరరావు హేమంత్ మరియు ట్రాఫిక్ వారియర్స్ పాల్గొన్నారు.

# నూకాంబిక అమ్మవారికి బంగారు వస్తువుల బహూకరణ

**అనకాపల్లి , జూన్ 22 ( మనం న్యూస్ ) :** స్థానిక నూకాంబిక అమ్మవారికి విశాఖకు చెందిన సూర్య ట్రావెల్స్ అధినేత శెట్టిపల్లి సుబ్బారావు, చైతన్య స్రవంతి దంపతులు బంగారం వస్తువులను బహూకరించారు. 73 గ్రాముల ఎర్ర, తెలుపు పొడులతో కూడిన నామం, ఎర్ర పొడులతో కూడిన బొట్టును సోమవారం ఆలయ చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో శ్రీధర్ లకు అందజేశారు. ఈ సందర్భంగా దంప తులు నూకాంబిక అమ్మవారిని దర్శించుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



# రామవరం కొండపై శొంఠ్యాం ముఠా కన్ను



**విశాఖపట్నం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** ఆనందపురం మండలం శొంఠ్యాంలో గల కొండపై ఆక్రమణలకు పాల్పడిన ముఠా ఇప్పుడు రామవరంపై కన్నేసింది. రామవరం సర్వే నంబర్ 121, గంగసాని అగ్రహారంలోని సర్వే నంబర్-1లో ఎంఐజీ ప్లాట్ల కోసం వీఎంఆర్డీఏ సేకరించిన భూమికి ఆనుకుని గల కొండపై రైతుల ఆధీనంలో సుమారు 50 ఎకరాల కొనుగోలుకు అడ్వాన్స్‌లు ఇచ్చింది. ఆ భూములను అడ్డం పెట్టుకుని కొండపై మరికొంత భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తోంది. నాలుగేళ్ల క్రితం ఎంఐజీ ప్లాట్ల కోసం రామవరం, గంగసాని అగ్రహారం ప్రాంతాల్లో 260 ఎకరాలు డీపట్టా భూములను వీఎంఆర్డీఏ సమీకరించింది. డీపట్టా రైతులకు 900 గజాల ప్లాటు, రెవెన్యూ రికార్డుల్లో ఆక్రమణదారుడిగా గుర్తించిన రైతులకు 450 గజాల ప్లాటు ఇస్తారు. కొండ చుట్టూ ఉన్న 260 ఎకరాల్లో లేఅవుట్ వేసిన వీఎంఆర్డీఏ...ప్రస్తుతం రోడ్లు, డ్రైన్లు నిర్మాణ పనులు చేపట్టింది. రామవరం కొండ చుట్టూ డీపట్టా రైతులకు చెందిన భూముల పక్కన కొందరు సుమారు 50 ఎకరాల్లో తోటలు వేసుకుని చాలాకాలం నుంచి సాగులో ఉన్నారు. ప్రస్తుతం ఆ భూములను వీఎంఆర్డీఏ తీసుకోలేదు. ఇప్పుడు వాటిపై శొంఠ్యాంలో కొండపై కబ్జాకు తెగబడిన ముఠా కన్నుపడింది. రైతుల ఆక్రమణలో ఉన్న భూముల కొనుగోలుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు అడ్వాన్స్‌లు ఇస్తోంది. తోటలు సాగుచేస్తున్న రైతుల్లో కొందరి పేర్లు రెవెన్యూ రికార్డుల్లో ఆక్రమణదారులుగా ఉండగా, మరికొందరు పేర్లు లేవు. భవిష్యత్తులో వీఎంఆర్డీఏకు రైతుల ఆక్రమణల్లో ఉన్న తోటలు అవసరమవుతాయని ఈ ముఠా భావిస్తోంది. అందుకే అడ్వాన్స్‌లు ఇచ్చిందని చెప్పుకుంటున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన తరువాత ఆ భూములకు ఆనుకుని మరికొంత ఆక్రమించుకుని రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదుచేసుకోవాలని భావిస్తున్నట్టు ప్రచారం సాగుతుంది. మండలంలో తాము చెబితే కాదనే పరిస్థితి లేదని ఈ ముఠాలో కొందరు సభ్యులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ముఠాలో కీలక వ్యక్తి గతంలో వైసీపీలో ఉండేవారని, ఇప్పుడు కూటమి పార్టీలో చేరి రామవరం, శొంఠ్యాం ప్రాంతాల్లో పలు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆనందపురం టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఇటువంటి వ్యక్తుల వల్ల కూటమికి చెడ్డపేరు వస్తోందని, రామవరం, శొంఠ్యాంలలో వారి ఆగడాలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

# మార్కెట్ కమిటీల్లో ఈ-పర్మిట్..వచ్చే నెల ఒకటి నుంచి అమలు

**చోడవరం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో వ్యవసాయ, వాణిజ్య పంటల రవాణా కోసం జూలై నుంచి ఈ-పర్మిట్ విధానం అమలు కానున్నది. వ్యవసాయ, వాణిజ్య పంటల కొనుగోలు, రవాణా చేసే వ్యాపారులంతా తప్పనిసరిగా లైసెన్సు పొందాలి. ప్రభుత్వానికి ఆన్‌లైన్‌లో సెస్సు చెల్లించి పర్మిట్ పొందిన తరువాత ఆయా పంటలను రవాణా చేసుకోవాల్సి వుంటుంది. మార్కెట్ కమిటీల పరిధిలో వ్యవసాయ, వాణిజ్య పంటల ఉత్పత్తుల రవాణాకు మార్కెటింగ్ శాఖ అధికారులు ఇప్పటి వరకు మాన్యువల్ పద్ధతిలోనే పర్మిట్లు జారీ చేస్తున్నారు. ఇకపై ఈ విధానానికి స్వస్తి పలికి ఆన్‌లైన్‌లోనే పర్మిట్ల జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రూపొందించిన యాప్ ద్వారా ఈ-పర్మిట్ సులభతరంగా జారీ చేసే విధానంపై ఇప్పటికే వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగులకు ప్రభుత్వం శిక్షణ ప్రారంభించింది. మార్కెట్ కమిటీల పరిధిలోని వ్యాపారులు ఇకపై తమ ఉత్పత్తులను ఈ-పర్మిట్ ద్వారానే రవాణా చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే మార్కెట్ కమిటీ చెక్ పోస్టుల వద్ద ఉత్పత్తులకు పర్మిట్ల జారీకి గతంలో నగదు తీసుకుని ఇచ్చే విధానాన్ని కూడా నిలిపివేసి, చెక్ పోస్టుల వద్ద కూడా యాప్ ద్వారానే పేమెంట్ చెల్లించి ఈ-పర్మిట్ పొందాలి. వ్యవసాయ, వాణిజ్య పంటల ఎగుమతులకు అవసరమైన పర్మిట్లను ఇంతవరకు ఆయా వ్యవసాయ మార్కెట్ కమిటీలు మాన్యువల్ పద్ధతిలోనే జారీ చేస్తున్నాయి. ట్రేడ్ లైసెన్స్ వ్యాపారులు ఆయా మార్కెట్ కమిటీలు ఇచ్చే పర్మిట్లతోనే ఆయా పంటను ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. లైసెన్సులేని వ్యాపారులైతే ఆయా చెక్ పోస్టుల వద్ద సిబ్బందికి నగదు చెల్లించి పర్మిట్లు పొందుతున్నారు. ఈ తరహా జారీ చేస్తున్న పర్మిట్లకు, రవాణా చేస్తున్న ఉత్పత్తులకు పొంతన లేకపోవడం, మరికొన్ని చోట్ల వ్యవసాయ మార్కెట్ చెక్‌గేట్ల వద్ద సిబ్బంది చేతులు తడిపి, పర్మిట్లు లేకుండానే ఉత్పత్తులను తరలించడం వంటి కారణాలతో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆదాయానికి గండిపడుతున్నది.



ఇంకా ఒకే పర్మిట్‌పై పలు వాహనాల్లో ఉత్పత్తులు రవాణా చేయడం, తనిఖీలు చేసే చెక్ పోస్టుల వద్ద మామూళ్లు ఇవ్వడం వల్ల కూడా ప్రభుత్వానికి ఆదాయం తగ్గిపోతున్నది. చాలామంది వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోకుండా, పర్మిట్లు లేకుండా చెక్‌పోస్టుల వద్ద మామూళ్లు చెల్లించి దొడ్డిదారిన ఉత్పత్తులను రవాణా చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల పరి?ధిలో వ్యవసాయ, వాణిజ్య పంటల ఉత్పత్తుల వ్యాపారాలు చేసేవారి సంఖ్యకు, పర్మిట్లు తీసుకునే వ్యాపారుల సంఖ్యకు పొంతన లేకపోవడానికి ఇదేకారణమని అంటున్నారు. ఈ క్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల పరి??ధిలో ఉత్పత్తుల రవాణాలో అక్రమాలకు చెక్ పెట్టడంతో పాటు ప్రభుత్వానికి సెస్సు ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచడం, వ్యాపారులను లైసెన్సు విధానంలోకి తీసుకు వచ్చేందుకు ఈ-పర్మిట్ విధానాన్ని అమలులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమలు చేయనున్న దృష్ట్యా వ్యవసాయ మార్కెట్ కమిటీల సిబ్బందికి ఈ-పర్మిట్ విధానంపై శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం నాన్-లైసెన్సు వ్యాపారులకు చెక్ పోస్టుల వద్ద సిబ్బంది మొబైల్ ఫోన్ యాప్‌లో పర్మిట్లు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ఇది కొద్ది కాలమే ఉంటుందని అంటున్నారు. లైసెన్సులేని వ్యాపారులు సైతం తప్పనిసరిగా రిజిస్ట?్రేషన్ చేసుకుని లైసెన్సు పొంది భవిష్యత్తులో ఈ-పర్మిట్ ద్వారానే ఉత్పత్తులను రవాణా చేయాల్సి ఉంటుంది. వ్యాపారులు తప్పనిసరిగా లైసెన్సు పొందడం, ప్రభుత్వానికి ఆన్‌లైన్‌లో సెస్సు చెల్లించి పర్మిట్ పొందిన తరువాత ఉత్పత్తులను రవాణా చేసుకోవాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ-పర్మిట్‌ను అమలు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

# ఎక్కడి చెత్త అక్కడి దుకాణాల్లోనే..పారిశుధ్య లోపంపై జీవీఎంసీ కమిషనర్ కన్నెర్ర

**విశాఖపట్నం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** నగరంలో పారిశుధ్య నిర్వహణపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ గట్టిగా దృష్టిసారించారు. ప్రధానంగా వాణిజ్య ప్రాంతాలు, దుకాణాల వద్ద పరిశుభ్రత నిర్వహణ, డస్ట్‌బిన్‌ల ఏర్పాటుపై ఎంతగా అవగాహన కల్పించినా ఆశించిన ఫలితం కనిపించకపోవడంతో కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సోమవారం ఉదయం బీచ్‌రోడ్డు, చినవాల్తేరు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లిన ఆయన దుకాణాలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల ముందు చెత్త కనిపించడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. దుకాణం ముందున్న చెత్తను పారిశుధ్య సిబ్బందితో ఎత్తించి అదే దుకాణంలోని కౌంటర్ల లో వేయించారు. దుకాణం ముందు విధిగా మూడు డస్ట్‌బిన్‌లు పెట్టాలని చెప్పినప్పటికీ పట్టించుకోకపోవడంపై దుకాణదారులను ఆయన నిలదీశారు. డస్ట్‌బిన్‌లు లేకపోవడంతో వినియోగదారులు చెత్తను రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై, కాలువల్లో పడేస్తున్నారన్నారు. డస్ట్‌బిన్‌లను దుకాణం ముందు ఉంచకుండా బాధ్యతారహితంగా వ్యవహరించిన వ్యాపారులకు రూ.పది వేలు చొప్పున జరిమానా విధించారు. ఇకపై దుకాణాల ముందు చెత్త కనిపిస్తే తమ సిబ్బంది ఆ చెత్తను పోగేసి తిరిగి ఆ దుకాణాల్లోనే వేస్తారని స్పష్టంచేశారు. 'పారిశుధ్యం పట్ల బాధ్యత లేకుండా వ్యవహరించే వారికి ఇకపై రిటర్న్ గిఫ్ట్ కింద ఇదే తరహా శిక్ష విధిస్తామని' కమిషనర్ స్పష్టంచేశారు. అనంతరం అక్కడకు సమీపంలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించేసి నిర్వహిస్తున్న చికెన్ దుకాణం వద్దకు వెళ్లారు.



ఫుట్‌పాత్‌పై దుకాణం పెట్టకూడదని తెలిసి కూడా ఎలా ఆక్రమించారని దుకాణదారుడిని ప్రశ్నించారు.

తక్షణం దుకాణం తొలగించి ఫుట్‌పాత్‌ను పాదచారులు నడిచేందుకు అనువుగా ఉంచకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అక్కడే ఉండి ఫుట్‌పాత్‌పై దుకాణాన్ని తొలగింపజేశారు. ఇకపై నగరంలోని అన్ని మార్కెట్‌లు, వాణిజ్యప్రాంతాలు, దుకాణాల వద్ద పరిశుభ్రత విషయంలో ఇదే తరహాలో కఠినంగా వ్యవహరించాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ఆరంభమైనందున గెడ్డల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 20న కురిసిన వర్షానికి పార్క్‌హోటల్ సమీపంలోని గెడ్డ పొంగి రోడ్డుపై ప్రవహించడానికి కారణం ఏమిటని ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. గెడ్డల్లో వ్యర్థాలు పేరుకుపోవడం, గెడ్డల ఆక్రమణ వల్లే ఆ పరిస్థితి తలెత్తిందని అధికారులు సమాధానం ఇచ్చారు. ఇకపై గెడ్డల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు గెడ్డల్లో వ్యర్థాలు వేసేవారిని గుర్తించి జరిమానా విధించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

# సదరం పాట్లు..స్లాట్లు దొరకడం గగనం

**విశాఖపట్నం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** వైకల్యాన్ని నిర్ధారిస్తూ ప్రభుత్వం అందించే సదరం సర్టిఫికెట్ పొందడం దివ్యాంగులకు సవాల్‌గా మారుతోంది. ముఖ్యంగా స్లాట్స్ పరిమిత సంఖ్యలో కేటాయిస్తుండడంతో బుకింగ్స్ ప్రారంభమైన కొద్దిగంటల్లోనే అయిపోతున్నాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రులను ఎంపిక చేసుకోవాల్సి వస్తోంది. బుకింగ్ సమయంలో అభ్యర్థులు తమకు సమీప ఆస్పత్రులో స్లాట్స్ లేకపోతే, ఆ తరువాత ఉన్న ఆస్పత్రులను ఎంపిక చేసుకోవాలి. అక్కడ కూడా లేకపోతే ఇతర జిల్లాల్లో ఆస్పత్రులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల జిల్లాకు చెందిన వందలాది మంది దివ్యాంగులు ఇతర జిల్లాల్లోని ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇతర జిల్లాలకు చెందిన దివ్యాంగులు కూడా అదే తరహాలో ఉమ్మడి విశాఖలోని ఆస్పత్రులకు రావాల్సి వస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో 25 ఆస్పత్రుల్లో సదరం వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. వారంలో రెండు రోజులు శిబిరాలను నిర్వహిస్తూ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను అధికారులు చేపడుతున్నారు. సదరం సర్టిఫికెట్ పొందేందుకు రాష్ట్రవ్యాప్తంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. సొంత జిల్లాలోని ఆస్పత్రుల్లో స్లాట్ దొరక్కపోతే ఇతర జిల్లాల్లోని ఆస్పత్రులను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. ఒకవేళ అవకాశం వచ్చినప్పుడు స్లాట్ బుక్ చేసుకోలేకపోతే మరో ఆరు నెలలపాటు నిరీక్షించాల్సి ఉంటుంది. అన్ని నెలలపాటు నిరీక్షించ లేకే చాలామంది ఇతర జిల్లాల్లోని ఆస్పత్రులను ఎంపిక చేసుకుంటున్నారు. అయితే, సుదూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు దివ్యాంగులను తీసుకువెళ్లడానికి వారి కుటుంబ సభ్యులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపించడంపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరుతున్నారు. ఏ జిల్లాకు చెందిన దివ్యాంగులు ఆ జిల్లాలోనే స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించాలని అభ్యర్థిస్తున్నారు. అలాగే, ప్రస్తుతం ఒక్కో ఆస్పత్రికి కేటాయిస్తున్న స్లాట్స్ సంఖ్యను పెంచాలి. దీనివల్ల దివ్యాంగులకు స్థానిక ఆస్పత్రుల్లోనే పరీక్షలు నిర్వహించి సదరం సర్టిఫికెట్ ఇచ్చేందుకు అవకాశం కలుగుతుంది.

# ప్రాణం తీసిన ఈత సరదా

## గంభీరం రిజర్వాయర్‌లో యువకుడి మృతి

**ఆనందపురం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** ఈత సరదా యువకుడి ప్రాణాల్ని బలిగొంది. స్నేహితులతో కలిసి గంభీరం రిజర్వాయర్‌లో ఈతకు దిగిన ఓ యువకుడు నీట మునిగి మృతిచెందాడు. ఎస్ఐ ఎం. హరీశ్ తెలిపిన వివరాలు ప్రకారం..సిరిపురం ప్రాంతానికి చెందిన గొట్టుముక్కల శ్రీధర చక్రవర్తి (28), జి.ప్రశాంత్, సౌవిక్ చౌదరి సోమవారం తెల్లవారుజామున సూర్యోదయం తిలకించేందుకు గంభీరం రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. అనంతరం ఈత కొట్టడానికి రిజర్వాయర్‌లోకి దిగారు. ఇద్దరు ఒడ్డున స్నానాలు చేస్తుండగా, శ్రీధర చక్రవర్తి రిజర్వాయర్ లోపలకు వెళ్లడంతో మునిగిపోయాడు. స్నేహితులు గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని వారు అక్కడికి చేరుకుని వెంటనే విపత్తు నిర్వహణ బృందం, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చక్రవర్తి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి తండ్రి గొట్టుముక్కల మధుజగన్నాథరాజు ఏయూలో కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. చేశారు. శ్రీధర చక్రవర్తి, అతడి స్నేహితులు నగరంలోని ఓ కళాశాలలో ఎంబీఏ పూర్తిచేశారని, ప్రస్తుతం ఖాళీగా ఉన్నారని ఎస్ఐ హరీశ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేశామన్నారు.

# ఉద్యోగుల విభజనపై కసరత్తు..కొత్త జిల్లాల ప్రాతిపదికగా కసరత్తు

**విశాఖపట్నం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** కొత్త జిల్లాల ప్రాతిపదికన ఉద్యోగుల విభజన కోసం సీనియారిటీ జాబితాలు రూపొందించే పని చురుగ్గా సాగుతోంది. నాలుగేళ్ల క్రితం కొత్త జిల్లాలను ఏర్పాటుచేసినప్పుడు అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ప్రతి శాఖలో కొంతమందిని కొత్త జిల్లాలకు పంపారు. ఆ తరువాత బదిలీలు, పదోన్నతులు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగానే చేపట్టారు. అయితే కొత్త జిల్లాల ప్రాతిపదికగా ఉద్యోగుల విభజన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం జిల్లా, జోనల్, మల్టీ జోనల్ అంటూ నిర్దేశించి, ఆ మేరకు సీనియారిటీ ఖరారు చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. దీనికి అనుగుణంగా ప్రస్తుతం విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి స్థానికత, ఉద్యోగంలో చేరిన తేదీ, తదితర వివరాలను సేకరిస్తున్నారు. నాలుగు నుంచి పదో తరగతి వరకు కనీసం నాలుగు సంవత్సరాలు చదివిన ప్రాంతాన్ని లోకల్‌గా పరిగణిస్తారు. ఒక ఉద్యోగి ఒకచోట నుంచి మరోచోటకు వెళ్లడానికి నేటివిటీని ప్రాతిపదికగా తీసుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసింది. శాఖల వారీగా సీనియారిటీ వివరాలతో జాబితాలు పంపేందుకు ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసింది. అయితే కొన్ని శాఖలు ఇప్పటికే సీనియారిటీ జాబితాలు సిద్ధం చేసి ఆయా శాఖల ప్రధాన కార్యాలయాలకు పంపగా మరికొన్ని ఇంకా కసరత్తు చేస్తున్నాయి. జిల్లా విద్యా శాఖ ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా మంజూరైన పోస్టులకు



అనుగుణంగా ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను సిద్ధం చేసి పాఠశాల విద్యా శాఖకు పంపింది.

ఉమ్మడి జిల్లాలో 10,893 టీచర్ పోస్టులకు సంబంధించి తొమ్మిది వేలకుపైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. కాగా పంచాయతీరాజ్‌లో ముఖ్యంగా 969 గ్రామ పంచాయతీల్లో పనిచేసే సిబ్బంది సీనియారిటీ జాబితాను రూపొందించే పనిలో డీపీవో కార్యాలయం అధికారులు నిమగ్నమై ఉన్నారు. రెవెన్యూ శాఖ పరిధిలో మూడు జిల్లాల్లో సుమారు వెయ్యి మంది వరకు పనిచేస్తున్నారు. అటెండర్ నుంచి డిప్యూటీ తహశీల్దారు వరకు, గ్రామ పాలనాధికారులు, సర్వేయర్లు ఇలా ప్రతి కేడర్‌లో సీనియారిటీ జాబితా దాదాపు సిద్ధం చేశారు. సీనియారిటీ జాబితాల రూపకల్పనకు సంబంధించి అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న వారి వివరాలు ఆయా జిల్లా కలెక్టర్ల నుంచి విశాఖ జిల్లాకు వచ్చాయి. వాటిని పరిగణనలోకి తీసుకుని రెండు, మూడు రోజుల్లో మొత్తం సీనియారిటీ జాబితా రూపొందించి ప్రభుత్వానికి పంపనున్నారు. మిగతా శాఖల్లో కేడర్ విభజనపై సీనియారిటీ జాబితాలు రూపొందించే పనిలో అధికారులు ఉన్నారు. సీనియారిటీ జాబితా మేరకు సిబ్బందిని జిల్లాలకు కేటాయిస్తారని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. జాబితాలో ఎక్కువ సీనియారిటీ ఉన్న ఉద్యోగులకు మొదట ఆప్షన్ ఇస్తారని పేర్కొన్నారు.

# 28న పల్స్ పోలియో..ఐదేళ్లలోపు వారందరికీ తప్పనిసరిగా చుక్కలు వేయించాలి

**విశాఖపట్నం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** జిల్లాలో ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమం ఏర్పాట్లపై సోమవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 28న బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు వేయాలన్నారు. అనంతరం 29, 30 తేదీల్లో ఇంటింటి సందర్శన ద్వారా మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయాలన్నారు. జిల్లాలో 0 నుంచి ఐదేళ్లలోపు 1,89,712 మంది చిన్నారులు ఉన్నారన్నారు. కార్యక్రమం నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా 1,062 పోలియో బూత్‌లు, 62 ట్రాన్సిట్ బూత్‌లు, 94 మొబైల్ బూత్‌లు ఏర్పాటుచేయనున్నట్టు చెప్పారు. ఇంటింటి సర్వే కోసం 2,004 ప్రత్యేక బృందాలు, 4,518 మంది వ్యాక్సినేటర్లు, 120 మంది సూపర్‌వైజర్లు విధులు నిర్వహించనున్నారన్నారు. ఆర్టీసీ బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్‌లో ట్రాన్సిట్ బూత్‌లు ఏర్పాటుచేసి ప్రయాణంలో ఉన్న చిన్నారులకు కూడా పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.లూసీ కార్డిలియో, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ఆర్.రమేష్‌తోపాటు వివిధ శాఖల అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# ప్రాథమిక విద్యా విధానం భేష్..ప్రపంచబ్యాంకు బృందం ప్రశంసలు

**మల్కాపురం , జూన్ 22 ( మనం న్యూస్ ) :** రాష్ట్రంలో ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు బాగున్నాయని ప్రపంచ బ్యాంకు బృందం అభినందించింది. బ్యాంకు సౌత్ ఆసియా వైస్ ప్రెసిడెంట్ జోహెన్నెస్ జట్ నాయకత్వంలోని బృందం సోమవారం నగరంలోని మల్కాపురం ప్రాంతంలో గల త్రినాథపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను సందర్శించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (ఎస్ఏఎల్‌టీ) కార్యక్రమంలో మోడల్ ఫౌండేషన్ స్కూల్ సాధించిన ప్రగతిని ఆయన స్వయంగా పరిశీలించారు. మోడల్ ఫౌండేషన్ స్కూల్ ప్రయాణం, విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి చేపట్టిన చర్యలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దాడ హరికృష్ణ వివరించారు. అనంతరం ప్రపంచబ్యాంకు ప్రతినిధులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలతో ముచ్చటించారు. పిల్లల సమగ్ర వికాసానికి తోడ్పడే ఫోర్ కార్నర్స్ లెర్నింగ్ స్పేస్‌ను సందర్శించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు, స్టాల్ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ సతీష్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ జె.చంద్రశేఖర్‌రావు, ఏఎంవో జి.లక్ష్మి, సీడీపీవో నీలిమ, మండల విద్యాశాఖాధికారులు త్రినాథరావు, వెంకటరావు, ఐసీడీఎస్ అధికారులు, పాఠశాల విద్యాశాఖ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్త్రీశక్తి'తో 73.62 కోట్ల ఉచిత ప్రయాణాలు



**అమరావతి , జూన్ 22 ( మనం న్యూస్ ) :** రాష్ట్రంలో 'స్త్రీశక్తి' పథకాన్ని ప్రారంభించిన నాటి నుంచి జూన్ 18 వరకు 73.62 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు చేశారని రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్త్రీశక్తి, దివ్యాంగ శక్తి పథకాలను ప్రవేశపెట్టిన తర్వాత బస్సుల అక్యుపెన్సీ 69 శాతం నుంచి 92 శాతానికి పెరిగిందని పేర్కొన్నారు. ఆర్టీసీలో విద్యుత్ బస్సుల ను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దశలవారీగా ఈ-బస్సు సర్వీసులను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో గ్రామీణ ప్రాంతాలకు కూడా విద్యుత్ ఏసీ బస్సులు నడపనున్నట్లు చెప్పారు. గత రెండేళ్లలో రవాణా శాఖ సాధించిన ప్రగతిపై సోమవారం మంత్రి సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. 20 24-25లో 1489 కొత్త బస్సులను అందుబాటులోకి తెచ్చామన్నారు. స్త్రీశక్తి పథకానికి 2025-26 సంవత్సరానికి రూ.1200 కోట్లు, 2026-27 సంవత్సరానికి ఇప్పటి వరకు రూ.160 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. ఆర్టీసీకి ప్రయాణ చార్జీల ద్వారా కాకుండా, ఇతర మార్గాల ద్వారా వచ్చే ఆదాయం పెరిగిందని తెలిపారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టడంపై ఉద్యోగులు, కార్మిక సంఘాలు ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు స్పష్టం చేశారు. జీసీసీ విధానంలో ఆర్టీసీ యాజమాన్య హక్కులు, సేవల నిర్వహణ, డ్రైవర్ల నిర్వహణ, షెడ్యూళ్లు, ఆదాయ నిర్వహణ, కార్యకలాపాల పర్యవేక్షణ మొత్తం సంస్థ ఆధీనంలోనే కొనసాగుతుందన్నారు. ప్రైవేటు భాగస్వామ్య సంస్థలకు బస్సుల సాంకేతిక నిర్వహణ, చార్జింగ్ మౌలిక సదుపాయాల నిర్వహణ వంటి పరిమిత బాధ్యతలు మాత్రమే ఉంటాయన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్‌లకు ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందిస్తామని, భవిష్యత్తులో సంస్థనే సమర్థంగా ఈ సేవలను నిర్వహించే సామర్థ్యాన్ని బలోపేతం చేస్తామన్నారు. ప్రభుత్వం గ్రీన్ ట్రాన్స్‌పోర్టుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను మంజూరు చేయించడంతో పాటు, కాలపరిమితి ముగిసిన వాహనాల స్థానంలో వచ్చే ఐదేళ్లలో జీసీసీ (గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్) విధానం ద్వారా మొత్తం 8321 విద్యుత్ బస్సులను దశలవారీగా ప్రవేశపడతామని వెల్లడించారు.

పీఎం ఈ-బస్ సేవ పథకం కింద 750 ఈ-బస్సులను 11 నగరాల్లోని 12 డిపోల్లో ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి ఈ బస్సులు దశల వారీగా అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. అదేవిధంగా తిరుపతికి అదనంగా 300 ఈ-బస్సులను కేంద్రం మంజూరు చేసిందని దీనికి టెండర్లు కూడా విడుదలయ్యాయయన్నారు. పూర్వోదయ పథకం కింద బస్సుల కేటాయింపు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఆర్టీసీకి సంబంధించిన భూమిని కానీ, ఏ ఆర్టీసీ డిపోను గానీ ఎవరికీ దారాదత్తం చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. అన్నీ ఆర్టీసీ కంట్రోల్‌లోనే ఉంటాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 85 ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్ల ద్వారా పారదర్శక, సాంకేతికత ఆధారిత డ్రైవింగ్ పరీక్షల వ్యవస్థను విజయవంతంగా అమలు చేశామన్నారు. 2024-25లో రూ.4004 కోట్లుగా ఉన్న రవాణా శాఖ ఆదాయం, 2025-26 నాటికి రూ.5050 కోట్లకు పెరిగిందని, ఇది ప్రభుత్వ సంస్కరణలు, పారదర్శకత పరిపాలనకు నిదర్శనమన్నారు. రోడ్డు భద్రతపై సమగ్ర నిఘా, బస్సు కదలికలపై మానిటరింగ్‌కు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు.




# డొంకరాయి నుంచి నీరు విడుదల



**సీలేరు , జూన్ 22 ( మనం న్యూస్ ) :** సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి సోమవారం రాత్రి గోదావరి డెల్టా ఖరీఫ్ పంటలకు మూడు వేల క్యూసెక్కుల నీటిని జెన్‌కో అధికారులు విడుదల చేశారు. గోదావరి డెల్టా ఖరీఫ్ పంటలకు రాజమహేంద్రవరం ధవళేశ్వరం వద్ద నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో సీలేరు కాంప్లెక్సు నుంచి 7 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేయాలని జెన్‌కో ఉన్నతాధికారులను ఇరిగేషన్ అధికారులు కోరారు. ఈ మేరకు గోదావరి డెల్టాకు నీరు విడుదల చేయాలని సీలేరు కాంప్లెక్సు అధికారులను జెన్‌కో ఉన్నతాధికారులు ఆదేశించారు. సోమవారం రాత్రి ఏడు గంటల నుంచి డొంకరాయి జలాశయం ఆరు, ఏడు నంబర్లు గల రెండు గేట్లు ఎత్తి మూడు వేల క్యూసెక్కుల నీటిని గోదావరి డెల్టాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీలేరు కాంప్లెక్సు ఎస్‌ఈ(మెకానికల్) భీమవరపు బాలకృష్ణ మాట్లాడుతూ సీలేరు నుంచి ఏడు వేల క్యూసెక్కులు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారుల విజ్ఞప్తి మేరకు పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి ద్వారా 4 వేల క్యూసెక్కులు, డొంకరాయి జలాశయం నుంచి విద్యుదుత్పత్తి లేకుండా నేరుగా మరో మూడు వేల క్యూసెక్కులు కలిపి మొత్తంగా ఏడు వేల క్యూసెక్కులు గోదావరి డెల్టాకు విడుదల చేస్తున్నామన్నారు. ఈ నెల 27 వరకు ఈ నీటి విడుదల కొనసాగుతుందని, పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో 4 మిలియన్ యూనిట్ల వరకు విద్యుదుత్పత్తి జరుగుతుందని ఆయన తెలిపారు.